రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం 8
శాకాంబరీ అవతారంలో వాసవీ మాత దర్శనం 7



ఆసుపత్రులకు సీజనల్ తాకిడి

- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగుల కిట కిట
- జలుబు, దగ్గు, వైరల్ జ్వరాలతో సతమతం
- పెరుగుతున్న డెంగీ కేసులు

జగిత్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులతో ప్రజలు ఆసుపత్రులకు వరుస కడుతున్నారు. ప్రధా నంగా వైరల్ జ్వరాలు, డెంగీ, టైఫాయిడ్ వ్యాప్తి చెందుతుండడంతో వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ తదితర శాఖల అధికారులు దృష్టి సారించారు. సీజనల్ జ్వరాల వ్యాప్తిని అరికట్టడానికి ఒక వైపు పలు చర్యలు తీసుకుంటున్నా మరో వైపు జ్వరాల తాకిడి ఆగడం లేదు. ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా ఆసుపత్రుల్లో రోగులు క్యూ కడుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల వ్యాధుల వ్యాప్తి పెరుగుతుందన్న అంచనాలున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరిగింది. పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో బయట పడుతున్న కేసుల వివరాలను యాజమాన్యాలు ప్రభుత్వ అధికారులు అందించడం లేదు. ఫలితంగా పలు డెంగీ, మలేరియా కేసులు ప్రభుత్వ పరంగా లెక్కల్లోకి రావడం లేదు. ప్రైవేటు ల్యాబ్‌లు, ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు వైద్య అధికారులకు సమాచారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నిత్యం వందల సంఖ్యలో వైరల్ ఫీవర్ కేసులు, అక్కడక్కడ డెంగీ, మలేరియా కేసులు ఉంటున్నట్లు వైద్య వర్గాలు అంటున్నాయి.

జిల్లాలో వైద్య ఆరోగ్య పరిస్థితి ..

జిల్లా కేంద్రంలో ప్రధాన ఆసుపత్రితో పాటు మెడికల్ కళాశాలకు అనుబంధంగా మాతా శిశు కేంద్రం పని చేస్తున్నాయి. వీటితో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 151 సబ్ సెంటర్లు, 24 గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 71 పల్లె దవాఖానాలు, 3 బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలు వైద్య సేవలు అందిస్తున్నారు. వీటితో పాటు సుమారు 200 వరకు పలు ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. 2024 సంవత్సరంలో ఇప్పటివరకు 29 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల వైరల్ ఫీవర్, డెంగీ, మలేరియా కేసులను వైద్యులు గుర్తిస్తున్నారు. వారం రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఔట్ పేషంట్ల సంఖ్య, ఇన్ పేషంట్ల సంఖ్య రెట్టింపు అయినట్లుగా తెలుస్తోంది.

పెరిగిన ఆర్‌ఎంపీల రెఫరెన్స్‌లు...

జిల్లాలోని పలు పల్లెల్లో ఆర్‌ఎంపీలదే హవా కొనసాగుతోంది. పల్లె ప్రాంతాల్లో జ్వర పీడితులు ఎక్కువగా ఉంటుండడంతో ముందుగా స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు రెండు, మూడు రోజుల పాటు చికిత్స అందిస్తుండగా జ్వరాలు తగ్గని పరిస్థితుల్లో పట్టణాలు, నగరాల్లో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. పట్టణాల్లో గల ప్రైవేటు ఆసుపత్రులల్లో సైతం రోగుల తాకిడి పెరిగింది. రోగుల అవసరాలను ఆసరా చేసుకుంటున్న ప్రైవేటు యజమాన్యాలు రూ. వేలల్లో ఫీజులు గుంజుతున్నాయి. ఇందులో కొంత మొత్తాన్ని రెఫర్ చేసిన ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రైవేటు ఆసుపత్రులు కమిషన్ల రూపంలో చెల్లిస్తున్నాయి. దీంతో రోగుల జేబులు గుల్లా అవుతున్నాయి.

ఇవి పాటిస్తే మేలు...

దోమకాటుతో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, బోదకాలు, మెదడు వాపు తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. ఈ వ్యాధులు రాకుండా గ్రామాల్లోని నిలిచిన నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడం, లేదంటే దోమలను తినే గంబూసియా అప్పినిస్ చేపలను వాటిలో వేసి గుంతలు పూడ్చడం వంటివి చేయాల్సి ఉంటుంది. మురుగు కాలువలు శుభ్రంగా ఉంచడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ లాంటివి చేయాల్సి ఉండగా సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండ కుండా జాగ్రత్త పడడం, వారానికోసారి డ్రమ్ముల్లోని నీటిని పారబోయటం, నీటి ట్యాంకులు, డ్రమ్ములు, మంచి నీటి ట్యాంకులపై మూతలు పెట్టడం, కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాల్సిన బాధ్యతల గురించి ప్రజలకు వివరించాల్సిన అవసరముంది.



జ్వరం తగ్గకపోతే పరీక్షలు...

రోగాల బారిన పడి ఆసుపత్రులకు వస్తున్న వారిలో మూడు, నాలుగు రోజుల్లో జ్వరాలు తగ్గకపోతే డెంగీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. అంతే కాకుండా ఎక్కడైతే డెంగీ కేసు నమోదు అయిందని సమాచారం వస్తే వెంటనే అక్కడి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది వెళ్లి ఇంటి పరి సరాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు. మరోవైపు కాలనీలు, అపార్ట్ మెంట్ వాసులు చెత్తను రహదారులపై పారబోయకుండా జాగ్రత్త లు వహిస్తున్నారు. గతంలో ప్రతీ శుక్రవారం ఒక్క రోజు మాత్రమే డ్రైడే పాటించగా, ప్రస్తుతం సీజన్ ముగిసే వరకు నిత్య డ్రైడేగా పాటిస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాము

డాక్టర్ నీలారపు శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్, టీ డయాగ్నోస్టిక్స్ సెంటర్

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు ఎప్ప టికప్పుడు తీసుకుంటున్నాము. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యే క జాగ్రత్తలు వహిస్తున్నాము. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుతుండడంతో పాటు మురుగు నీరు నిలువ ఉన్న ప్రాంతాలను గుర్తించడం, ఇళ్లలో ట్యాంకులు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉండి లార్వా పెరిగే అవకాశా లున్న వాటిని గుర్తించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము.



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

కొడిమ్యాల, జూలై 19 : వైద్య సిబ్బంది ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిపించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలో కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అంతకు ముందు గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యాధుల వ్యాప్తికి కారణమైన దోమల నివారణకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల వలన మలేరియా, డెంగ్యూ ఇతర వ్యాధులు వస్తాయన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, ఏఎంవో సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ డా.. నవనీత, స్టాఫ్ నర్స్ శ్రీజ, వైద్య సిబ్బంది వేణు, లచ్చయ్య, ఏఎన్‌ఎం పద్మ, గ్రామ కార్యదర్శి పావని, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పంటరుణ మాఫీపై రైతుల ఆందోళన

మల్యాల, జూలై 19: లక్ష వరకు పంట రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వం, మాఫీ జాబితాలో సగం మందికిపైగా రైతుల వివరాలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దీంతో రుణమాఫీపై బెంగపెట్టుకున్నారు. మండల వ్యాప్తంగా లక్ష లోపు పంట రుణాల మాఫీ 2207మంది రైతులకు గురువారం ప్రకటించిన జాబితాలో పేర్కొన్నారు. అయితే మరో 1500 మంది లక్ష రుణం రైతుల పేర్లు లేకపోవడంతో అధికారుల చుట్టూ రైతులు ప్రదిక్షణలు చేస్తున్నారు. గతంలోనూ మాఫీ కాక ఇప్పుడు జాబితాలో తమ పేర్లు లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్ష రుణమాఫీకి మండలంలోని మల్యాల సింగిల్ విండో పరిధిలో 450మంది రైతులు ఉండగా 255మంది, తక్కళ్లపల్లి సింగిల్ విండోలో 224 రైతులకు 117రైతులకు, నూకపల్లి సింగిల్‌విండో పరిధిలో 277రైతులకు 102మంది రైతులకు, పోతారం సింగిల్‌విండో పరిధిలో 563 రైతులకు 205 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయినట్లు జాబితాలో పేర్లు ప్రకటించారు. అదనంగా ఇతర బ్యాంకుల్లో తీసుకున్న రైతులు వందల్లో ఉంటారని అధికారులు పేర్కొంటుండగా రుణమాఫీ అవుతుందో లేదోననే ఆందోళన చెందుతున్నారు. ఇందులో గతంలోనూ రుణమాఫీకి నోచుకోని అనేక మంది రైతులు ఉండగా ప్రస్తుతం కూడా తమ పేర్లు లేకపోవడం పట్ల దిగాలు చెందుతున్నారు. కాగ ఈ విషయమై వ్యవసాయ, సహకార సంఘాల అధికారులను సంప్రదించగా సోమవారం నాటికి మరో జాబితా వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసిందని రైతులు ఆందోళన చెందవద్దని అంటున్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలి

జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్



మొక్కలు నాటుతున్న జడ్పీ డిప్యూటీ సీఈవో, రఘువరన్

కోరుట్ల, జూలై 19 : సీజన్ వ్యాధుల నివారణపై ప్రజలు అవగాహన కల్పించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్ మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. పట్టణంలోని 1, 9, 27 వార్డులలో మున్సిపల్ కమిషనర్ తిరుపతితో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పట్టణంలోని మున్సిపల్ అధికారులు డ్రైడే గురించి విద్యార్థులకు వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మురికి కాల్వలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి ఇండ్లలో ఉన్న నిలువ నీటిని తొలగించి వాటి శుభ్రం చేశారు. పట్టణంలోని డంపింగ్ యార్డు, ప్రజాపాలన కేంద్రాలను జడ్పీ డిప్యూటీ సీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ డిప్యూటీ సీఈవో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరు డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ పాల్గొన్నారు.

నేడు గొల్లపల్లి మండలంలో ప్రభుత్వ విప్ పర్యటన

గొల్లపల్లి, జూలై 19 : గొల్లపల్లి మండలంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం వివిధ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి పేర్కొన్నారు. గొల్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖలపై జరిగే రివ్యూ మీటింగ్‌లో లక్ష్మణ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు. మండలం నలు మూలల నుంచి కాంగ్రెస్ పార్టీ తాజామాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

లండన్‌లో అంతర్జాతీయ పట్టా అందుకున్న జగిత్యాల యువతి

జగిత్యాల, జూలై 19 (ఆన్‌లైన్): పట్టణానికి చెందిన టీవీ సూర్యం కుమార్తె శ్రీజ ఐల లండన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ లెస్ సిస్టర్ నుంచి ఎంఎస్‌సీలో ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్ పట్టాను అందుకుంది. శుక్రవారం లండన్‌లో జరిగిన విశ్వ విద్యాలయ స్నాతకోత్సవంలో ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్ పట్టాను పొందారు. లండన్‌లో పట్టా పొందిన శ్రీజ ఐలను కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, రోటరీ హ్యాపి మిత్రులు అభినందించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి ట్రస్మా మద్దతు

మల్యాల, జూలై 19: రాబోయే కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉండనున్న ట్రస్మా రాష్ట్ర నాయకులు యాదగిరి శేఖర్‌రావుకు మద్దతుగా ప్రైవేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు నిలువాలని మండల ట్రస్మా నాయకులు కోరారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యలపై అవగాహన కలిగిన శేఖర్‌రావుకు ప్రైవేట్ విద్యాసంస్థలు అండగా నిలిచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ట్రస్మా రాష్ట్ర నాయకులు ప్రతాప్ కిషన్‌రావు, మండల శాఖ అధ్యక్షుడు పోకల నరేష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు శేఖర్‌రావుకు మద్దతుగా తీర్మానం చేశారు.

కోరుట్ల మున్సిపల్‌లో బీఆర్‌ఎస్ ఖాళీ

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య,కౌన్సిలర్లు

కోరుట్ల, జూలై 19 : కోరుట్ల పట్టణంలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు అత్యంత సన్నిహితుడుగా పేరున్న పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్ కుమార్, అతడి భార్య మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య శుక్రవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అందరూ ఊహించిన విధంగానే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిల్ సభ్యులు గతంలో కొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా నూత నంగా మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో కోరుట్ల మున్సిపల్‌లో బీఆర్ఎస్ పూర్తిగా ఖాళీ అయినట్లయింది. చైర్‌పర్సన్ దం పతులతో పాటు ఆరుగురు కౌన్సిలర్లు యాటం పద్మ, సజ్జు బాయ్, గందం గంగాధర్, బద్ది సుజాత మురళీ, జిందం లక్ష్మీనారాయణ, ఫర్ హాత్ బేగం-అబ్దుల్ రహీంలను కాంగ్రెస్‌లో చేరారు. గాంధీ భవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదా స్ మున్షి, కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌ల సమక్షంలో వీరందరూ పార్టీలో చేరారు.

వారికి దీపాదాస్ మున్షి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి సమర్థ నాయకత్వంలో ఆరు గ్యారెంటీల అమలు, రెండు లక్షల రుణ మాఫీ అమలు, పలు విప్లవాత్మక నిర్ణయాలు, తదితర అంశాల ప్రాతిపదికగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పట్ల ప్రజలల్లో వస్తున్న స్పందన చూసి ఆకర్శితులయ్యామన్నారు. జువ్వాడి నర్సింగరావు, నాయకులు జువ్వాడి కృష్ణారావు నాయకత్వంలో పనిచేసేందుకు, కోరుట్ల పట్టణ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో కాంగ్రెస్ చేరినట్లు ప్రకటించారు. వీరి చేరిక పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో పురోగతి సాధించాలి

అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి

రాయికల్, జూలై 19: అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో పురోగతి సాధించాలని అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) గౌతమ్ రెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పుమడుగు ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి పురోగతి సాధించాలని, వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ఏఈకి మొత్తం పనులను వారంలోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే మండల పరిషత్‌లో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. వర్షాకాలం సమీపించినందున పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వ హించాలని, పన్నుల వసూళ్లలో వేగవంతం చేయాలని అన్నారు. అలాగే వరద ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు చేపట్టాలని అన్నారు. మొదటిసారిగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన అడిషనల్ కలెక్టర్‌ను మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఉప్పుమడుగు ప్రధానోపాధ్యాయుడు, పంచాయతీ కార్యదర్శి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాపాలన సేవా కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఒడ్డెర కాలనీలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

రాయికల్, జూలై 19: రాయికల్ మండలంలోని రామాజీ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఒడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో పదో న్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధ వా రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామాజీపేట పాఠశాల ఉపాధ్యాయులు వేల్పుల స్వామి యాదవ్, వల్వోజు శ్రీనివాసచారి, తంగళ్లపెల్లి సతీష్, అంజుం బేగం, ఒడ్డెర కాలనీ ఉపాధ్యాయులు బొల్లె గంగాధర్, దొంతి సతీష్‌లను శాలువాలతో సత్కరించి, మెమెంటో, పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయడు గజ్జెల నరేందర్, మాజీ సర్పంచులు బెజ్జంకి మోహన్, మన్నెగుండ్ల వెంకమ్మ నర్సయ్య, ఉప సర్పంచ్ బోదాసు సుజాతరాజేష్, ఎంపీటీసీ మందుల శ్రీను, ఏపీసీ చైర్మన్ నర్సవ్వ, కార్యదర్శి రాజేష్, వాసరి రవి యాదవ్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ కటుకం రమేష్, తెనుగు రమేష్, లక్ష్మీకాంతం, ప్రతాప్‌రెడ్డి, మైన శేఖర్, బూసి రమ, జ్యోతి, యశోద, ఉపాధ్యాయులు మహేష్, సుజాత, సుమలత పాల్గొన్నారు.



బోనాల వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

రవీంద్ర ప్లే స్కూల్‌లో ఆకట్టుకున్న బోనాలు

జగిత్యాల అర్బన్, జూలై 19: ఆషాడమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక రవీంద్ర ప్లే స్కూల్‌లో బోనాల కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల నుంచి విద్యార్థులు బోనాలతో పురవీధుల గుండా ర్యాలీగా స్థానిక గాజుల పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో భాగంగా బోనాలతో పాటు విద్యార్థుల పోతురాజుల వేషాలు, నృత్యాలు ఆహూతులను అలరించాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా బోనాల పండగను నిర్వహించామని నిర్వాహకులు సుమన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, రజిత, అజిత, మౌనిక, కొమురవెల్లి కిషన్, రాజు, పోచమ్మ ఆలయ చైర్మన్, మాజీ కౌన్సిలర్ రాజేందర్ పోషకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బోనాల వేడుకల్లో నృత్యాలు చేస్తున్న పోతురాజులు

పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

సైదాపూర్, జూలై 19: సైదాపూర్ మండలంలోని ఎలబోతారం గ్రామానికి చెందిన మొలుగు లచ్చమ్మ(70) అనే వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం,, ఎలబోతారం గ్రామానికి చెందిన లచ్చమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు లచ్చమ్మను చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతు లచ్చమ్మ మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. దీనిపై ఎస్సై జన్ను ఆరోగ్యంను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఎగువ నుంచి ఎస్సారెస్పీకి పెరిగిన వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు పెరుగుతోంది. శుక్రవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాం తాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 17,283 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 16.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 26.112 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 475 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 10.584 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.979 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా మహేశ్

చొప్పదండి, జూలై19: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది, చైర్మెన్‌గా కొత్తూరి మహేశ్, వైస్ చైర్మెన్ మునిగాల రాజేందర్, సభ్యులుగా చుప్ప శ్రీనివాస్, పెరుమాండ్ల రవీందర్, ఈర్ల స్వామి, జక్కుల అనిల్ కుమార్, గోస్కుల కొమురెల్లి, పత్తిపాక నరేశ్, వెల్లాల ఆదిరెడ్డి, జాతరకొండ ఓదయ్య, చిలుక సంజీవ్, కొత్తపల్లి నవీన్, యంసాని శంబయ్య, పట్వారి కిషన్‌ను ప్రకటించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయికల్, జూలై 19: మండలంలోని ధర్మాజీపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం రాయికల్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరొకరుపారిపోయినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.8100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. గ్రామాల్లో పేకాట ఆడితే సమాచారం ఇవ్వాలని సూచించారు.

నరసింహుడి ఆలయంలో భక్తుడిపై దాడి

ధర్మపురి, జూలై 19: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఒక భక్తుడిపై ఆలయ ఉద్యోగి, కొందరు కలిసి శుక్రవారం దాడికి పాల్పడ్డాడు. ఆలయ నిత్యాన్నదాన సత్రంలో ఒక భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నాడు. బియ్యం దొడ్డుగా ఉన్నట్లు ఉద్యోగులతో పాటు వంట తయారీ చేసిన వ్యక్తిని అడిగినట్లు సమాచారం. అయితే తమకు ఏమి తెలియదని ఈవో ఆఫీస్‌లో ఫిర్యాదు చేయమని భక్తుడికి తెలియసేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగి అన్నదానం ప్రదేశానికి రావడం వల్ల భక్తుడు దొడ్డు బియ్యం గురించి అతనికి వివరించారు. అనంతరం ఉద్యోగి పేరు, హోదా గురించి ప్రశ్నించాడు. వెంటనే ఆ ఉద్యోగి ఆఫీస్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని చెప్పి వెళ్లినట్లు సమాచారం. భక్తుడు ఈవో కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయగా ఆ ఉద్యోగికి భక్తుడికి తీవ్ర వాదోపవాదాలు జరిగినట్లు తెలిసింది. భక్తుడి కుటుంబ సభ్యులతో కలిసి ఆఫీస్ నుండి కింది రాగా ఆలయ ఆవరణలో కుటుంబ సభ్యుల సమక్షంలో భక్తుడిని ఉద్యోగి సహా మరి కొందరు కొట్టినట్లు తెలిసింది. ఈ విషయమై ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నం చేయగా అందుబాటులో లేరు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- గ్రామాభివృద్ధి పేరుతో వేలం పాటలు

- పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

మల్లాపూర్, జూలై 19: మల్లాపూర్ మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. అనుమతులు లేకుండా ఇష్టారీతిన ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేయడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు ఇసుక రవాణాను అడ్డుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల అభివృద్ధి పేరిట వీడీసీలు గ్రామంలో కూల్ డ్రింక్, పెట్రోల్, డీజిల్, చికెన్ విక్రయాలు చేయడానికి, ఇసుక, మట్టిని తరలించడానికి వ్యాపారం చేసుకోవడానికి వేలం పాటలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో అక్రమ వ్యాపారస్థులు రెచ్చిపోతున్నారు. గోదావరి పరివాహక గ్రామాల్లో దొరికే ఇసుక అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. ఇక్కడి నుంచి పట్టణ ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను వ్యాపారులు అక్రమంగా తరలించడమే దందాగా మార్చుకొని సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక అధికారులు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ఇసుక రవాణాకు ఎలాంటి అడ్డూ అదుపు లేకుండా సాగుతోందని స్థానికుల చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక మాఫీయా ఆగడాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మికుంట, జూలై 19: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తండా ఉండాలని జమ్మికుంట టౌన్ సీఐ రవి అన్నారు. మండలంలోని శాయంపేట గ్రామంలో గ్రామస్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దన్నారు. అలాగే యువత చెడు మార్గంలో వెళ్లకుండా ఉండాలన్నారు. డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత లక్ష్యం కోసం క్రమశిక్షణతో చదవాలని సూచించారు. చదువుతోనే జీవితంలో ఉన్నత స్థానం దక్కుతుందని చెప్పారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



శాయంపేటలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవి

పేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలి

▸ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 19: అర్హులైన పేదలకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందేలా, పథకాలు అమలయ్యేలా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్, జిల్లా ఎస్పీలు, ఇతర అధికారులు పారదర్శకంగా పనిచేయాలని రాష్ట్ర సాగునీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా రైతు భరోసా అమలుపై మంత్రివర్గ ఉపసంఘం రైతుల నుంచి అభిప్రాయాల సేకరణకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కరీంనగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సుడా చైర్మన్, జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ప్రత్యేకంగా కలెక్టర్లు, సీపీ, ఎస్పీల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పనితీరును మంత్రులు ప్రశంసించారు. 60 శాతం పైగా భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులే వస్తున్నా యని సీపీ అభిషేక్ మొహంతి మంత్రుల దృష్టికి తీసుకురాగా బాధితు లకు న్యాయం అందించేలా పారదర్శక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇదే విధంగా ముందుకుసాగాలన్నారు. న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు.

● ఎమ్మెల్యేలతో కూడా మంత్రులు కొద్దిసేపు మాట్లాడి నియో జకవ ర్గాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాన కొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ని యోజకవర్గాల పరిధిలో రోడ్డు, ఇతర అభివృద్ధి పనులతోపాటు ఇంది రమ్మ ఇళ్లు, స్థానికంగా నెలకొన్న సమస్యలను మంత్రులు దృష్టికి తీసు కువచ్చారు. వీటన్నిటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని మంత్రు లు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ శివారు ప్రాంతాల్లో భూకబ్జాలు అధికమయ్యాయని, పేదలు, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమా వేశంలో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లా కలెక్టర్లు, కరీంనగర్ పోలీస్‌కమిషనర్, జగిత్యాల, సిరిసిల్ల ఎస్పీలు, అడిషనల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

● కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పౌరసరఫరాలశాఖ అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు ఉమ్మడి జిల్లాలో ఆయా శాఖల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణకు అన్యాయం



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

▸ రాష్ట్ర విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలి

▸ సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

భగత్‌నగర్, జూలై 19: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలు అమలు కాకపోవడంతో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలు అమలు అంశాలను ప్రవేశపెట్టాలని చెప్పారు. పునర్విభజన చట్టంలోని హామీల అమలుపై తెలంగాణకు చెందిన కేంద్రమంత్రులు స్పందించాల న్నారు. చట్టంలోని అంశాలు అమలు కాక తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్సిటీ, వెనుకబడిన జిల్లాల అభివృ ద్ధికి ప్రత్యేక నిధులు, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని విభజన హామీల్లో ఉన్నప్పటికీ అమలు చేయలే ద న్నారు. ఆంధ్రప్రదేశ్ లో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చా రని, తెలంగాణ ప్రాజెక్టుకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం లో ముఖ్య మంత్రిగా కేసీఆర్ అనేక తప్పులు చేశారని ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును విస్మరించారని చెప్పారు. ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ ప్రాణ హిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ ఆధ్వ ర్యంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు దశల వారీగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రానికి సంబంధించి సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిలిపి వేయాలన్నారు. వేలం వేసే అంశంపై తీవ్రంగా చర్చ జరుగుతుందని, వేలం వేస్తే ప్రైవేటీకరణ చేసినట్లే అవుతుం దని, సింగరేణిని ప్రైవేటీకరణ చేయనని చెప్పిన మోదీ పచ్చి అబద్ధాల కోరనే విషయం అర్థమయిం దన్నారు. 27వ తేదీన గ్లోబల్ టెండర్లు పిలుస్తున్నందున తక్షణమే టెండర్‌లు రద్దుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ప్రక్రియను ప్రారంభించిం దన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించకుండా రుణమాఫీ చేయాలని, బ్యాంకుల్లో సమస్యలు తలెత్తకుండా పూర్తిగా రుణమాఫీ చేయాలన్నారు. రైతు భరోసా ఇప్పటి వరకు ఇవ్వలేదని తక్షణమే చెల్లించాలన్నారు. ఎకరానికి 7,500 ఇస్తామని హామీ ఇచ్చారని సంవత్సరానికి 15 వేలు ఇవ్వాలని, ధాన్యానికి 500 బోనస్ ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని చెప్పిందని అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరుచేయాలన్నారు. ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. రేషన్ కార్డులు లేక పదేళ్ల పాటుప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధిహామీ కూలీలకు వారానికి ఒకసారి కూలీ డబ్బులు చెల్లించాలని సూచిం చారు. సీఎం రేవంత్‌రెడ్డి పారదర్శకపాలన అందించాల న్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుపై సీపీఐ నాయకత్వం, ప్రజా సంఘాలు కిం ది స్థాయి వరకు పరిశీలించి ప్రజలకు అందే విధంగా చూస్తామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలుపెట్టుకున్నా రని వాటన్నిం టిని అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో నాయకులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, గూడెం లక్ష్మి, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, కిన్నెర మల్లవ్వ, నలువాల సదానందం, బామండ్లపల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, నల్లగొండ శ్రీనివాస్, కృష్ణ యాదవ్ తది తరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట జూలై 19: కోనరావుపేట మండలం మర్తన్‌పేట గ్రామానికి చెందిన జవ్వాజి శేఖర్ అనే గీత కార్మికుడు తాడిచెట్టు పైనుంచి పడగా గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం కల్లు తీయడానికి చెట్టు ఎక్కు తుండగా ప్రమాదవశాత్తుకింద పడిపోయాడు. గాయా లైన శేఖర్‌ను తోటి కార్మికులు వెంటనే సిరిసిల్ల ఆస్పత్రికి తరలిం చారు.

41 మంది మందుబాబులకు జరిమానా

తంగళ్లపల్లి, జూలై 19: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారితోపాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 41 మందికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఉదయశ్రీ జరిమానా విధించినట్లు తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్ తెలిపారు. తం గళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడిం చారు. తంగళ్లపల్లి మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందిని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి 18 మందిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.2 వేలు, తొమ్మిది మందికి రూ. 1,500, 11 మందికి రూ.1000, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 18 మందికి రూ.210 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గొల్లపల్లిలో వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిపేట, జూలై 19: ఎల్లారెడ్డిపేట మండలం గొల్ల పల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహ దారిపై సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యం లోని పోలీసులు శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని 25 మంది వాహ నదారులకు జరిమానా విధించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాల న్నారు. వాహన పత్రాలు లేకుండా నడిపితే సీజ్ చేస్తా మని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ధర్మారం, జూలై 19: ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలో తండ్రి మందలిం చాడని పురుగుల మందు తాగి ఆత్మాహత్యా యత్నం చేసిన నేరేళ్ల మహేష్ (26) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు.. ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేరేళ్ల భూమయ్య కొడుకైన మహేష్ ఇటీవల తనకు సెల్ ఫోన్, బైక్ కొనివ్వాలని, లేదంటే తను చనిపోతానని తండ్రిని బెదిరించాడు. దీంతో తండ్రి సెల్‌ఫోన్, బైక్ కొనిచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 17న తొలి ఏకాదశి సందర్భంగా పండగపూట తండ్రి కొడుకును ఊరికే బైక్ మీద తిరగకు, రోజులు బాగా లేవని మందలించాడు. మనస్తాపానికి గురైన మహేష్ ఇంటి వెనకాల పురుగుల మందు తాగి పడిపోయాడు.. గమనించిన కుటుంబ సభ్యులు వైద్య చికిత్సల నిమిత్తం హుటాహుటిన కరీంనగర్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహేష్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన వృద్ధుడు..

సుల్తానాబాద్, జూలై 19: సుల్తానాబాద్ మండలంలోని రేగడి మద్దికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన సుద్దాల కొమురయ్య అలియాస్ చిక్కుడు కొమురయ్య (63) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొమురయ్య తన ఇంట్లో గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని మల్లయ్య పల్లి గ్రామానికి శుక్రవారం సాయంత్రం తీసుకువచ్చారు. కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు గుంటల భూమి కోసం మరదలిని హత్యచేసిన బావ

- నాలుగు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు

గంగాధర, జూలై 19: ఆరుగుంటల భూమి పంచి ఇవ్వడంలేదని కక్ష పెంచుకుని సొంత భార్య చెల్లిని హత్య చేసిన నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గర్షకుర్తికి చెందిన చిందం మాధవి ఈనెల 15న అనుమానాస్పదంగా మృతి చెందిందని ఆమె మేన మామ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మాధవి కొన్ని రోజులుగా తమ మాటవినకుండా యువకుడితో సన్నిహితంగా ఉంటుందని, తమకు రావాల్సిన గర్షకుర్తిలోని 6 గుంటల భూమి పంచి ఇవ్వడంలేదని బావ గుండ అంజనేయులు, అక్క గుండ మానసలు కక్ష పెంచుకు న్నారు. ఈక్రమంలో ఏలాగైనా మాధవి అడ్డుతొలగించుకుని భూమిని కాజేయాలని ఆంజనేయులు ఈనెల 14 గర్షకుర్తికి వచ్చాడు. ఇంటిలో మాధవి ఒంటరిగా ఉండగా భూమి విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రేకుడైన ఆంజనేయులు తన మాట వినడంలేదని చున్నీతో మాధవి మెడకు బిగించి చంపివేశాడు. అనంతరం ఎవ్వరికి అనుమానం రాకుండా ఇంట్లోని ఫ్యానుకు ఉరి వేరివేసుకున్నట్లు వేలాడదీశాడు. అనుమానం రాకుండా స్వగ్రామం తిమ్మాపూర్ మండలం నుస్తులాప ూర్‌కు వెళ్లి తన భార్య మానసకు విషయం చెప్పాడు. అయితే అనుమానాస్పదకేసు నమోదు చేసిన ఎస్ఐ కిరణ్‌రెడ్డి వివిధ కోణాల్లో విచారించారు. అంజనేయులు, మానసలు నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐ కిరణ్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

గంజాయికి అలవాటుపడి..పెడ్లర్‌గా మారి..

- ● గంజాయి సరఫరా చేస్తున్న బీటెక్ విద్యార్థి
- ● మరో ఐదుగురితో కలిసి గంజాయి సేవిస్తుండగా పట్టుబడిన వైనం
- ● 150 గ్రాముల గంజాయి స్వాధీనం..కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, జూలై 19: గంజాయికి అలవాటుపడిన ఓ బీటెక్ విద్యార్థి డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో గం జాయి సేవిస్తుండగా అతడితో పాటు మరో ఐదు గురు విద్యా ర్థులను పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇబ్రహీం పట్నం టౌన్‌లో ఓ ప్రైవేటు హాస్టల్‌పై నార్కోటిక్ బృందం, ఇబ్రహీంపట్నం పోలీసులు గురువారం రాత్రి సం యుక్తంగా దాడులు చేసి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు. గంజాయి సరఫరాదారుడితో కలిపి ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఇందులో గంజాయి సరఫరాదారుడు పరారీ లో ఉన్నారు. సీఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ టౌన్‌కు చెందిన శ్రీ రాముల సాత్విక్ (21) ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజ నీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ.. ఇక్కడ ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా, అతనికి సిరిసిల్ల సమీపంలోని ఇల్లంతకుంటకు చెందిన నవీన్(25)తో పరిచయం ఏర్పడింది. నవీన్ భద్రాచలం ఏజెన్సీ ఏరియా నుంచి గంజాయిని తీసుకొచ్చి సాత్విక్‌కు సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో గంజాయికి అలవాటుపడిన సాత్విక్ పెడ్లర్‌గా మారి ఇబ్రహీంపట్నం పరిసరాల్లో చదువుతున్న విద్యార్థులకు గంజాయి పాకెట్లను విక్రయిస్తున్నాడు. ఇదే క్రమంలో తాను చదువుతున్న కళాశాలలోనే బీటెక్ విద్యార్థులు నూకల సంప త్‌నాయుడు (20), ఓ మైనర్, స్వయంపాకుల కార్తీక్ (20)ల తోపాటు నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఓ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్న పడాల వంశీ(20), దంపేట గణేష్ (21)లతో పరిచయం పెంచుకున్నాడు. నవీన్ మిన హా పై ఆరుగురు ఇబ్రహీంపట్నంలోని ఓ హాస్టల్‌లో గంజాయి సేవిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు.. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో నార్కోటిక్ బృందం, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. కాగా, సాత్విక్‌పై ఇదే విషయంలో మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కూడా గతంలో ఓ కేసు నమోదైంది. నవీన్‌పై మీర్‌పేట్‌లో ఓ కేసు, సిరిసిల్లలో మూడు కేసులున్నాయి. ఈ మేరకు వీరిపై కేసులు నమోదు చేశామని, గంజాయి అమ్మకందారైన సాత్విక్‌ను రిమాండ్‌కు పంపినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మరో నిందితుడు నవీన్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

అటవీశాఖలో అధికారుల బదిలీలు

సిరిసిల్ల క్రైం , జూలై 19: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలువ రు అటవీశాఖ అధికారులు శుక్రవారం బదిలీ అయ్యారు. 3 సంవత్సరాల కంటే ఎక్కువ ఒకే చోట పనిచేసిన సెక్షన్ అధికా రులు, బీట్ అధికారులకు బదిలీ తప్పలేదు. సిరిసిల్ల సెక్ష న్ అధికారి భూలక్ష్మీ సిరిసిల్ల స్ట్రైకింగ్ ఫోర్స్ సెక్షన్ అధికారిగా, గంగాధర డిప్యూటీ రేంజ్ అధికారిగా బాపిరాజు, వెంకటాపూర్ డిప్యూటీ రేంజ్ అధికారిగా మోహన్ లాల్ , శ్రవణ్‌కుమార్‌కు సిరిసిల్ల సెక్షన్ అధికారిగా, బీట్ అధికారులుగా వి సతీష్ (అల్మాస్‌పూర్), లావణ్య (గర్జనపల్లి), వసుమతి (పెద్ద లింగాపూర్)కు బదిలీ అయ్యారు. వీరందరూ జీవో నెంబర్ 18 ప్రకారం ఈ నెల 21న రిలీవ్ కావాల్సి ఉంది.

పోస్టర్ల ఆవిష్కరణ

సుభాష్‌నగర్, జూలై 19: నాస్తిక సమాజం మూడో మహాసభల పోస్టర్లను శుక్రవారం భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు ఉప్పలేటి నరేష్ కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుకొండలోని వడ్డేపల్లి పీఆర్‌రెడ్డి భవన్‌లో ఈనెల 24న మహాసభను నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. సమాజంలో కుల, మత, మూఢనమ్మకాల నిర్మూలన కోసం కృషి చేస్తున్న నాస్తిక సమాజం 52 సంవత్సరాలుగా ప్రజలకు ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు జాతీయ స్థాయిలో అనేక రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం హనుమకొండలో నిర్వహిస్తున్నామని నాస్తికులు సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

హుజూరాబాద్, జూలై 19: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని శుక్రవారం కాయకల్ప అవార్డు బృందం సభ్యులు డాక్టర్ హరిప్రియ, క్వాలిటీ మేనేజర్ సురేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో సుధాకర్‌రావు, ఏవో నారాయణరెడ్డిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా ఆస్పత్రిని ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున సీజనల్ వ్యాధులు ప్రబల కుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని పరిష్కరించాలి

- వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్



మాట్లాడుతున్న వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్

సిరిసిల్ల రూరల్, జూలై 19: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని మాట్లాడుతున్న వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో శుక్రవారం జేఏసీ నాయకుల సమావేశం సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలల్లో నెలకొన్న విద్యుత్ ఇతర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారిం చాలంటూ ఈ నెల 22 నుంచి సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలేనిరహారదీక్షలను చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. దీక్షలను కొనసాగిస్తూనే 22న సోమవారం వంటావార్పు కార్యక్రమంతో ప్రారంభించి 23న రాస్తారోకో, 24న పట్టణ బంద్‌కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే 25న చలో హైదారాబాద్ కార్యక్రమాన్ని చేపట్టి అసెంబ్లీని ముట్టడిం చేందుకు రూపకల్పన చేశామని వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అడెపు భాస్కర్, అసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ఏఐటీయూసీ లాల్‌బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం కార్యదర్శి పంతం రవి వివరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభంతోపాటు సమస్యలను పరిష్కారించాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు వివిధ రూపాల్లో తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేక పోవడంతో జేఏసీ అధ్వర్యంలో ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాలను కార్మికులు, అసాముల విజయవంతం చేయాలని కోరా రు. సమావేశంలో సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, అసాముల సంఘం నాయకులు గోనేపర్శరాముల, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి అంకాలపు రవి, పోలు శంకర్, కట్టెకోల లక్ష్మీనారా యణ, కోడం అశోక్, పిస్క మధు, ఏనుగుల ఎల్లయ్య, గోవిందు రవి, దూడం శంకర్, గాజుల నారాయణ, దూసభూమయ్య, మండల సత్యం, వెల్దండి దేవదాస్, మోర రాజు, కళ్యాడపు సుభాష్, బోద్దుల సుదర్శన్, బండారి అశోక్, బూట్ల నవీన్, బూర కనుకరాజు, దూడం రమేష్, గం గుల శ్రీనివాస్, కోడం శ్రీనివాస్, మండల బాలరాజు, శ్రీరాం సత్యం, హనుమండ్ల రామనారాయణ, బోడ్డు శ్రీధర్, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, జూలై 19: నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరా నికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్ల ప్రిన్సిపాల్ మం గతాయారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతూ ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా ఉమ్మడి జిల్లాలో నివసిస్తూ ఉండాలని ఆమె తెలిపారు. సెప్టెంబరు 16లోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డిపో మేనేజర్లు బాధ్యతల స్వీకరణ



ఈడీ వినోద్‌కుమార్‌కు పూలమొక్కను అందజేస్తున్న డిపో మేనేజర్లు

భగత్‌నగర్, జూలై 19: నూతనంగా నియమితులైన మంథని, వేములవాడ, సిరిసిల్ల డిపో మేనేజర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదోన్నతి పై మంథని, వేములవాడ, సిరిసిల్ల డిపోలకు మేనేజర్లుగా నియమితులైన వీఎస్ కుమార్, బి శ్రీనివాస్, ఎ ప్రకాశ్‌రావు బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం, హెడ్ ఆఫీస్, మెహదీపట్నంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్)గా పనిచేస్తున్న వారు డిపో మేనేజర్లుగా పదోన్నతి పొందారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి వినోద్‌కుమార్, రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత, డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె సత్యనారాయణ, డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్ర య్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

కొండచిలువ కలకలం



పొలంలో కనిపించిన కొండచిలువ

గంభీరావుపేట, జూలై 19: గంభీరావు పేట సమీపాన ఓ రైతు పొలంలో కొండచిలువ కనిపించడం కలకలం రేగింది. మల్యాల రాజవీర్‌కు చెందిన పొలంలో శుక్రవారం కొండచిలువను రైతు గమనించారు. వ్యవసాయ పనుల్లో ఉన్న ఆ రైతు కొండ చిలువ చూసి భయంతో వణికిపోయాడు. అతడు కేక లు వేయడంతో సమీప పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి చేరుకునే సరికి కొండచిలువ వెళ్లిపోయింది. దీంతో సమీ ప ప్రాంతాల్లో పొలాలు ఉన్న రైతులు భయాందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రుద్రంగి, జూలై 19: రుద్రంగి మండల కేంద్రం శివారులోని గంగమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగా యాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగిలోని గంగమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న బైక్ బస్సు ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న పండుల శ్రీనివాస్‌కు స్వల్పగాయాలయ్యాయి. శ్రీని వాస్ భార్య మాధవికి తీవ్రగాయాలయ్యాయి. శ్రీనివాస్, మాధవిని వేముల వాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై అశోక్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎస్‌యూ ఎం ఫార్మసీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూలై 19: శాతవాహన విద్యాలయంలో మే 2024లో నిర్వహించిన ఎం ఫార్మసీ ఒకటో, మూడో సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌యూ.ఏసీ.ఇన్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బైకును ఢీ కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు

బీర్‌పూర్, జూలై 19: ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులను అజాగ్రత్తతో ట్రాక్టర్ నడిపి వాహనాన్ని ఢీ కిట్టిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమో దు చేసినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురువారం దొంతాపూర్ గ్రామానికి చెందిన సర్దా లక్ష్మన్ అతడి భార్య జమున తమ ద్విచక్ర వాహనంపై దొంతాపూర్ నుంచి జగిత్యాలకు వెలుతున్నారు. నర్సింహులపల్లి గ్రామ శివారులో సూరపాక తిరుపతి బీర్‌పూర్ గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ నడుపుతూ వారి మోటర్‌సైకిల్‌ను ఢీ కొట్టాడు. దీంతో పై ఇద్దరికి గాయా లయ్యాయి. వరుసకు కొడుకైన సర్దా సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శాకాంబరీ అవతారంలో వాసవీమాత



కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల, జూలై 19: పట్టణంలోని వాసవీ దేవాలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారు శాకాంబరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేదపండితుడు పాలెపు రాంశర్మ మంత్రోచ్ఛారణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. వివిధ కూరగాయలతో అమ్మవారికి అలకరించి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక కంకుమపూజ కార్యక్ర మాన్ని నిర్వహించచారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. విష్ణు, లలిత సహస్ర నామ పారాయణం జరిపి గోరింటాకు వేడుకలను నిర్వహించారు. కార్యక్ర మంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు రాజేంధ్రప్రసాద్, సంతోష్, శ్రీకాంత్ పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్

సుభాష్‌నగర్, జూలై 19: చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ఈ నెల 30,31 తేదీల్లో తలపెట్టిన చలో ఢిల్లీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 1 నుంచి 10 వరకు కొడంగల్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని, అంబేద్కర్ అభయహస్తం కింద రూ. 12లక్షలు ప్రతి మాదిగ కుటుంబానికి ప్రభుత్వం ఇవ్వాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, పారిశుద్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మాదిగ సంఘాల ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కెటాయించాలని, వికలాంగులకు రూ. 7వేల ఫించన్ ఇవ్వాలని, సదా లక్ష్మమ్మ విగ్రహాన్ని టాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, డప్పు కొట్టే మాదిగలకు రూ. 5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య, కార్యదర్శి మాచారం మాసయ్య, ఉమ్మడి జిల్లా ఇంచార్జీ కనకం రవి, జిల్లా అధ్యక్షుడు రమాగిరి సారయ్య, బొడ్డు లక్ష్మన్, సంటి గణేశ్, ఖమ్మం కృష్ణ, మాట్ల రాజ్‌కుమార్, మాతంగి కుమారస్వామి, సందేల దేవయ్య, సుంకపాక దేవరాజు, దాల్లపల్లి లక్ష్మన్, అరికిల్ల గణపతి, ఖమ్మం కుమారస్వామి, ఎన్నగందుల శ్రీకాంత్, కనకం రాజు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా అధ్యక్షుడిగా మాట్ల రాజ్‌కుమార్

టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మాట్ల రాజ్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికి రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

హరీశ్‌రావును విమర్శించే హక్కు కాంగ్రెస్‌కు లేదు

● రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి



భూషణరావుపేటలో మాట్లాడుతున్న బాపురెడ్డి

కథలాపూర్, జూలై 19 : మాజీ మంత్రి హరీశ్‌రావును రాజీనామా చేయాలనే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని భూషణరావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన రాహుల్‌గాంధీ మాటలు బుట్టదాఖలయ్యాయని ఆరోపించారు. హరీశ్‌రావు చాలెంజ్‌కు ముందుకు రాకుండా కేవలం లక్ష రూపాయల రుణమాఫీ మాత్రమే చేసి చేతులు దులుపుకున్నార న్నారు. బీఆర్ఎస్ సర్కారు లక్ష రూపాయల రుణమాఫీకి రు. 19,109 కోట్లు మంజూరు చేస్తే కాంగ్రెస్ కోతలు పెట్టి కేవలం ఆరు వేల కోట్లు మాత్రమే విడుదల చేసిందని విమర్శించారు. కొడంగల్‌లో 2018లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ప్రకటించిన రేవంత్‌రెడ్డి మాట తప్పారని చెప్పారు. వరికి రు. 500 బోనస్ ఇస్తామని రైతులను నమ్మించి మోసగించారని పేర్కొన్నారు. ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేసి చూపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, బద్దం మహేందర్, పురుకుటపు గంగారెడ్డి, గడ్డం శేఖర్, వినోద్‌రావు ఉన్నారు.

ఆవాస విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



యూనిఫాంలు అందజేస్తున్న దాతలు

జగిత్యాల అర్బన్, జూలై 19: సేవా భారతి ఆధ్వర్యంలో నిరుపేద గ్రామీణ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వాల్మీకి ఆవాస విద్యార్థులకు పట్టణానికి చెందిన యశస్వీ ఎలక్ట్రానిక్స్ అధినేత కోటగిరి శ్రీనివాస్ మంగ ల కుమారుడు యశస్వీ శ్రావ్య దంపతులు 60 మంది విద్యార్థులకు రూ.40వేల విలువగల యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా ఆవాస కమిటీ సభ్యులు చిత్తారి మధుకర్ మాట్లాడుతూ గ్రామీణ నిరుపేద నిరక్షరాస్య కుటుంబాలకు చెందిన విద్యార్థులను ఎంపికచేసి వాల్మీకి ఆవాసంలో ఉచిత విద్య, వసతితో పాటు ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. సమాజంలో దాతల సహకారంతో ఆవాస విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, సంస్కారంతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. దాతలు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాస సభ్యులు ఎన్నమనేని అశోక్‌రావు, వెంకటేశ్వర్‌రావు, సంపూర్ణ చారి, ఆవాస ప్రముఖ్ సుద్దాల మల్లేశం తదితరులున్నారు.

విద్యతోనే సాధికారత సాధ్యం

జిల్లా సాధికారత కోఆర్డినేటర్ అశ్విని



బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జగిత్యాల అర్బన్, జూలై 19: ప్రతి బాలికను చదివించాలని, విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని జిల్లా మహిళా సాధికారత కో ఆర్డినేటర్ అశ్విని అన్నారు. బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమ అవగాహన సదస్సులో భాగంగా పట్టణంలోని స్థానిక నేతాజీ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మహిళా సాధికారత బృందంచే అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ అశ్విని మాట్లాడుతూ నేటి సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందంటే అభివృద్ధి వెనుక మహిళ ఉందనే వాస్తవాన్ని గమనంలోకి తీసుకోవాలన్నారు. మహిళ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సత్తా చాటుతున్నప్పటికీ మానసికంగా వెనుకబడి ఉన్నారన్నారు. బాలికలకు విద్య ప్రాధాన్యం వివరించడంతో పాటుగా, మహిళా హక్కులు, రక్షణ, 181, 1098, చైల్డ్‌హెల్ప్‌లైన్ అంశాలను వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సింగం భాస్కర్, జండర్ స్పెషలిస్ట్ గౌతమి, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

కోరుట్ల, జూలై 19 : పట్టణంలోని మార్కండేయ కళ్యాణ భవనంలో శుక్రవారం కోటి నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్, పట్టణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించంగా విశేష స్పందన లభించింది. రేకుర్తి ఆసుపత్రి వైద్యులు శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. శస్త్ర చికిత్స అవసరం ఉన్న వారిని రేకుర్తి ఆసుపత్రికి తరలించారు. అవసరం ఉన్న వారికి కళ్ల జోడ్లు, మందులు లయన్స్ క్లబ్ సభ్యులు అందించారు. అదే విధంగా లయన్స్ క్లబ్ రిజియన్ చైర్మెన్, పీఆర్‌బీఎం కళాశాల కరస్పాడెంట్ పోతని ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను క్లబ్ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పోతని లత, పోలాస గీతరాణి, అల్లాడి ప్రవీణ్ కుమార్, ఆడెపు కమల - మధు, గుంటుక చంద్రప్రకాష్, డా. దిలీప్‌రావు, చాప కిశోర్, ఉషాకిరణ్, గుంటుక సురేష్, గుంటుక కవిత, చాప వందన, శోభ, వనపర్తి రమ్య - చంద్రమోహన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల, జూలై 19: మండలంలోని తాటిపల్లి, రాంపూర్, పోతాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈఈలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు జరుగనున్నందున తాటిపల్లి, లంబాడిపల్లి, రాంపూర్, ఒడ్డెర కాలనీ, ఓగులాపూర్, పోతారం, రాజారం గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు

కొడిమ్యాల : మండలంలోని తిర్మాలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 20 శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ రఘునాథ్ తెలిపారు. తిర్మాలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మెన్టెనెన్స్ దృష్ట్యా సబ్ స్టేషన్ పరిధిలోని సంద్రల్లపల్లి, దమ్మయ్యపేట, కోనాపూర్, పోతారం, సూరంపేట, గంగారాంతం డా, హిమ్మతురావుపేట, శనివారంపేట, రాంసాగర్, డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం

మల్యాల, జూలై 19: మండల పరిషత్ కార్యాలయంలో జూ నియర్ అసిస్టెంట్‌గా కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న బి.మోహన్, ఆఫీస్ సబార్డినేట్ లక్ష్మీకాంతంను శుక్రవారం పలువురు నాయకులు సన్మానించారు. మోహన్ మేడిపల్లి మండలంకు, లక్ష్మీకాంతం కొడిమ్యాల మండలానికి బదిలీ అవుతుండగా సేవలను కొనియాడుతూ శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి, రాజే శ్వర్ రెడ్డి, నాంపల్లిగౌడ్, నల్లపు మల్లేశంతో పాటు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న మోహన్‌రావుపేట రైతులు

జగిత్యాల రూరల్, జూలై 19: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు నర్సింగాపూర్, వంజరిపల్లి రైతులు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అతిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వరంగల్ సభలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు. ఆగస్టు 15లోపు అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనగం నరేష్, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపి రాజరెడ్డి, తలారి రాజేష్, గరిపెల్లి శ్రీనివాస్, బూస గంగమల్లయ్య, అనుమల్ల సత్యనారాయణ, నెమిళ్ల స్వామిరెడ్డి, శివానందరెడ్డి, బుచ్చిరెడ్డి, వేణు, సత్యనారాయణరెడ్డి, మల్లయ్య, బాబు, ఎల్లయ్య, నారాయణ, గంగారాం పాల్గొన్నారు.

ఎండపల్లి: మండలంలోని గుళ్లకోట గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు బీసగోని సత్యం గౌడ్, మహిపాల్ రెడ్డి, భూమయ్య, గోనె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండలంలోని కోనాపూర్ గ్రామంలో శుక్రవారం రైతులకు రుణ మాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేసి సంబురాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో దుమాల నర్సయ్య, అంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, అజయ్‌గౌడ్, ఆదిరెడ్డి, లింగారెడ్డి, విజయ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఖత్తర్‌లో మండలంలోని చెప్యాల గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి ఎమ్మెల్యే సత్యం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పరిసర ప్రాంతాల రైతుల కుటుంబాల గల్ఫ్ కార్మికులు చిట్యాల తిరుపతి, మల్లేశం ఉన్నారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుల చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో ప్రభుత్వం రుణమాఫీ చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చుకుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు సుఖ సంతోషాలతో జీవించాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ధర్మపురి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, గ్రామ శాఖ అధ్యక్షులు కట్ట లక్ష్మణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కట్ట భువనేశ్వర్, మాజీ ఉపసర్పంచ్ కోరుట్ల శ్రీనివాస్, శంకర్, రాజన్న, మధుకర్‌రెడ్డి, అల్లె రమేష్, రాజన్న, శంకర్, ప్రభాకర్, లింగన్న పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

మెట్‌పల్లి: పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పట్టణంలో నాయకులు సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొమిరెడ్డి విజయ్‌ఆజాద్, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పట్టణకార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్, యూత్ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వేంపేట గ్రామంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ ఉపసర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, నాయకులు తుమ్మల లింగారెడ్డి, రాజారెడ్డి, మారంపల్లి రాష్ట్రపతి, నలిమెల అజయ్, జెట్టి లింగం పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని లోక్యానాయక్ తండాలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. గ్రామ ప్రధాన కార్యదర్శి రవి నాయక్, నాయకులు పాల్గొన్నారు.

మల్యాల: మండల వ్యాప్తంగా రైతులు, కాంగ్రెస్ నాయకులు పంట రుణమాఫీ సంబరాలు జరిపారు. మల్యాల అంగడిబజారులో కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు శనిగారపు తిరుపతి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటంకు క్షీరాభిషేకం చేశారు. రైతులకు రుణమాఫీ చారిత్రాత్మకమని పలువురు నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, కొక్కుల నాగభూషణం, కంచర్ల లక్ష్మనాచారీ, బట్టువిజయ్, యాగండ్ల సుమన్‌గౌడ్, నల్లపు మల్లేశం, బోగ రాజు, ఇమామ్, మారుతీ, బాబు పాల్గొన్నారు



ధర్మపురి మండలంలోని జైనాలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



రైతురుణమాఫీ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



వేంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి

మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి రూరల్, జూలై, 19: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని వేంపేట గ్రామంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎస్సై చిరంజీవి తో కలిసి మొక్కను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నాటిన చెట్లను నరికివేయకుండా వాటిని సంరక్షించుకోవాలని, నరికేసిన వారిపై వాల్టా చట్టం కింద అధికారులు చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. మొక్కలను నాటి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలబలడాలని, నాటిన మొక్క నుంచి వచ్చే గాలి, నీడ, పండ్లతో మన జ్ఞాపకాలు తరాలవారికి గుర్తులుగా ఉంటాయన్నారు. పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రజలందరిపై ఉందని, ప్రతి ఒక్కరు బాధ్యతతో ఇంటి ఆవరణం, పరిసరాలలో మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ వైర్ల కింద పెద్దగా పెరిగే మొక్కలను నాటకుండా ఖాళీ ప్రదేశాల్లో నాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై చిరంజీవి, మాజీ ఉప సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, నాయకులు రాజారెడ్డి, తుమ్మల లింగారెడ్డి, జెట్టి లింగం, పంచాయతీ కార్యదర్శి అశోక్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



వేంపేటలో మొక్క నాటుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, ఎస్సై చిరంజీవి

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మల్యాల, జూలై 19: మల్యాల బీసీ కాలనీకి చెందిన బెక్కం లక్ష్మన్ అనే యువకుడు ఇటీవల మృతి చెందగా మృతుడి కుటుంబసభ్యులకు మన నేస్తం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యు లకు రూ.10 వేలను అందజేశారు. అలాగే హైదరాబాద్‌లోని మన ఆపద్భాందవ ఫౌండేషన్ నిర్వహకులు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ జవాన్ కీసరి గణేష్, లవకుమార్, కోరెపు వెంకటేష్, సాయిరఘు, గుడిసె అలంకార్, కొక్కుల వేణు, సాయిచంద్, శ్రీనివాస్, సాయి, అరుణ్ పాల్గొన్నారు

ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలి

కోరుట్ల, జూలై 19 : ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏకు మార్చాలని ముదిరాజు మహాసభ యువజన జిల్లా అధ్యక్షుడు ఉరుమడ్ల చరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద ముదిరాజు మహాసభ సంఘ సభ్యులతో కలిసి ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతి ప్రతం అందించి మాట్లాడారు. 2023 జరిగిన శాసన సభ ఎన్నికల మెనిఫెస్టోలో అభయ హస్తంలో ఇచ్చిన హామీల ప్రకారం బీసీ డీ నుంచి బీసీ ఏకు మార్చాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, పోగుల భూమయ్య, సురేష్, సంతోష్, సత్తయ్య, పోగుల లింగమూర్తిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి, జూలై, 19 : ఇండ్లలో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు శుభ్రతను పాటిం చాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ సూచించారు. శుక్రవారం పట్టణంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా పట్టణంలోని 14వ వార్డులోని మురికి కాలువలపై టేమో పాస్ స్ప్రే బ్లీచింగ్ చేయించడం, ఇంటింటికి తిరిగి ఇండ్లలో ఉన్న పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, రోలు, ఇతర వస్తువులలో నిలిచిన నీరును పారపోయించి, చెత్తను తొలగింపజేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విష జ్వరాలు ప్రబలిన తరువాత కాకుండా ముందస్తుగా శుభ్రతను పాటించాలన్నారు. ఇంటి ఆవరణం, పరిసరాలలో నీరు నిల్వ ఉండ కుండా, పాడైన వస్తువులు, కుండీలు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. కూలర్‌లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తతీసుకోవాలి, లేకుంగే దాని ఆంటీలార్వా ద్వారా దోమ తయారైవుతుందన్నారు. ప్రజలందరూ ప్రతి శుక్రవారం, ఆదివారాలను డ్రైడేలుగా పాటించాలని, ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్య లకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మర్రి పోచయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ముజీబ్, వాల్గొట్ నరేష్, నిజాం, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు

సిరిసిల్ల టౌన్, జూలై 19: సిరిసిల్ల మున్సిపల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం మైసమ్మ బోనాల పండుగను నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మైసమ్మ దేవాలయానికి మున్సిపల్ మహిళా ఉద్యోగులు బోనాలతో తరలి వెళ్లారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్ర పాణి ప్రత్యేక పూజలు చేశారు. చైర్ పర్సన్ మాట్లాడారు. తెలంగాణ సంస్కృతీసంప్ర దాయాలను గౌరవిస్తూ సమాజహితం కోరుకుంటూ ము న్సిపల్ ఉద్యోగులు మైసమ్మ బోనాల పండుగను నిర్వహించుకున్నారన్నారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, పాలక వర్గం సభ్యులు, ప్రజల ఆరోగ్యం లక్ష్యంగా పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పారదర్శకంగా సేవలను అందిస్తున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ లావణ్య, పట్టణ ప్రణాళికా అధికారి అన్సారీ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడగట్ల మురళి ఉన్నారు.

బడి ముందు ఇలా.. లోపలికి వెళ్లేదెలా

పాఠశాల ఆవరణలో నిలిచిన నీటితో విద్యార్థుల ఇక్కట్లు



పాఠశాల ఎదుట నిలిచిన వర్షపు నీరు



నీటిని దాటుకుంటూ వెళ్లిన విద్యార్థులు

కొడిమ్యాల, జూలై 19 : మండలంలోని పూడూర్ ప్రాథమిక పాఠశాల ముందు మైదానంలో వర్షపు నీరు నిలిచింది. గత రాత్రి కురిసిన వర్షానికి వర్షపు నీరు, దానికి తోడుగా మురికి కాల్వ నీరు, పక్కన ఉన్న పొలాల నీరు చేరటంతో పాఠశాల మైదానంలో నిలిచింది. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పాఠశాల మైదానంలో నీరు నిల్వటంతో గతంలో తొలిగించారు. సంబంధిత అధికారులు పాఠశాల ముందు మొరం పోయించి నీరు నిల్వ కుండ తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. సంధ్యా రాణిని వివరణ కోరగా పాఠశాల ముందు నీరు నిల్వటంతో నీటితో పాటుగా పాములు, విష పురుగులు కనిపిస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేసున్నట్లు తెలిపారు. పాఠశాల మైదానంలో నీరు నిల్వ కుండ చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు కోరారు.

నిరుపేద విద్యార్థినికి లాప్‌టాప్ అందజేత

కథలాపూర్, జూలై 19 : మండలంలోని అంబారిపేటకు చెందిన అంగడి జ్యోత్స్న అనే విద్యార్థిని హైదరాబాద్‌లోని సీబీఐటీ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతుండగా నిరుపేద కుటుంబం కావడంతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ లాప్‌టాప్ వితరణగా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ నాయకులు జ్యోత్స్నకు అధునాతన లాప్‌టాప్‌ను అందజేశారు. నిరుపేద కుటుంబానికి అండగా నిలిచినందుకుగాను నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మండల బీజేపీ మాజీ అధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల మారుతి, కాశోజీ ప్రతాప్, గండ్ర అజయ్, మహేశ్, రవితేజ, గంగారెడ్డి ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఎండపల్లి, జులై 19: మండలంలోని మారేడుపల్లి గ్రామానికి చెందిన దర్శినాల చెంద్రయ్య ఇటీవలే అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతాకుమారి శుక్రవారం రోజున మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు.

మున్నూరుకాపు సంఘ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

కథలాపూర్, జూలై 19 : మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చెదలు సత్యనారాయణను శుక్రవారం చింతకుంటలో ఘనంగా సన్మానించారు. ఎన్నికైన అనంతరం మొదటిసారిగా స్వగ్రామంకు రావడంతో డప్పుచప్పుళ్ళతో ర్యాలీగా ఎదుర్కొన్నారు. మున్నూరుకాపు సంఘ సభ్యులు, కాంగ్రెస్ శ్రేణులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

పిల్లలను అంగన్‌వాడీకి పంపించాలి

మల్లాపూర్, జూలై, 19 : మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో అమ్మమాట అంగన్‌వాడీ బడిబాట ప్రదర్శన కార్యక్రమాన్ని టీచర్లు నిర్వహించారు. శుక్రవారం గ్రామాల్లోని ఐదు ఏళ్లలోపు చిన్నారులను గుర్తించి వారిని కేంద్రాలకు పంపించాలని టీచర్లు, ఏఎన్ఎమ్‌లు అవగాహన కల్పించారు. కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారంతో పాటు బోధన వస్తువులతో విద్యా బోధన నేర్పించడం జరుగుతుందని టీచర్లు గ్రామాల్లో ప్రచారం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ శైలజ, ఏఎన్ఎం కోమల, అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, జుమన, పద్మ, ఆయాలు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

గొల్లపల్లి, జూలై 19 : మండలం చిల్వాకోడూర్, భీంరాజ్ పల్లె గ్రామాల్లో త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలను ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పీరీల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించగా, మహిళలు, యువతులు పీరీలను దర్శించుకున్నారు. భీంరాజ్ పల్లె గ్రామంలో బీటీకె ఆధ్వర్యంలో కీ.శే. ఎరసాని రాజయ్య జ్ఞాపకార్థం యువకులు పెద్ద పులుల వ్రైలను పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువుల్లో పీరీలను నిమజ్జనం చేశారు.

అర్హులకు కాంప్లెక్స్ ఎరువులు ఇవ్వాలి

మేడిపల్లి, జులై 19: సహకార సంఘ పరిధిలోని రైతులందరికి పాక్స్ ద్వారా కాంప్లెక్స్ ఎరువులు యూరియా ఇవ్వాలని జిల్లా సహకార అధికారి రఘువరన్ అన్నారు. రైతులకు బస్తాలు ఇచ్చిన వెంటే ఇపాస్ మిషన్‌లోంచి బస్తాలను తొలగించాలని అన్నారు. ఎరువుల గోదాంను తనిఖీ చేసి స్టాక్ రిజిస్ట్రర్‌ను పరిశీలించారు. అనందరం రుణమాఫీ సంబందించి రైతుల వివరాలను తనిఖీ చేశారు. అయన వెంట సిఈవో బోందయ్య సిబ్బంది పాల్గోన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

కథలాపూర్, జూలై 19 : మండలంలోని తాండ్ర్యాలలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద శకుంతల రాయమల్లు అనే మహిళకు మంజూరైన రు 21 వేల చెక్కును కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషి మేరకు నిధులు మంజూరైనట్టు కాంగ్రెస్ నాయకుడు ఉరుమల్ల చారి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గడీల గంగప్రసాద్, నర్సయ్య ఉన్నారు.